

KADILIMCHE VAARTHA Telugu daily

కదిలించే వార్త


తెలుగు దినపత్రిక

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 235 మంగళవారం 25 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar


## భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే

# గుర్తొచ్చేది ముసునూరే



- నూతన పాప్‌కార్న్ సీడ్‌ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు
- కాట్రేనిపాడులో గోర్మే పాప్ కార్నికా సంస్థ ఆధ్వర్యంలో మట్నక్కజొన్న సీడ్ ఆవిష్కరణ
- గత 11 ఏళ్లలో పాప్‌కార్న్ మొక్కజొన్న ఉత్పత్తి వాటా 65 శాతానికి పెరగడం విశేషం
- ప్రపంచంలోని అన్ని దేశాలకు ఇక్కడి పాప్‌కార్న్‌ను ఎగుమతి చేసే బాధ్యతను తీసుకోవాలి
- "మన ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉంది
- అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లే వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుంది.

**అమరావతి**

భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే ముసునూరు గుర్తొస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏలూరు జిల్లా కాట్రేనిపాడులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కలసి నూతన పాప్‌కార్న్ సీడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ మార్కెట్‌లోకి తీసుకెళ్లే ఉత్పత్తికి ఎన్నో రెట్లు విలువ పెరుగుతుందని పేర్కొన్నారు. అందుకే ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, స్వదేశీ విధానాలతో స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లలో పాప్‌కార్న్ మొక్కజొన్న ఉత్పత్తి వాటా 65 శాతానికి పెరగడం విశేషమన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలకు ఇక్కడి పాప్‌కార్న్‌ను ఎగుమతి చేసే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. రవాణా సౌకర్యాలపై రైల్వే మంత్రితో మాట్లాడతానని ఉపరాష్ట్రపతి హామీ ఇచ్చారని తెలిపారు. ముసునూరు పాప్‌కార్న్‌తో పాటు అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా చేపట్టడం వల్లే తక్కువ కాలంలో ఈ విజయం సాధ్యమైందని సీఎం చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్న సాగు చేస్తున్నారని వివరించారు. కేవలం 11 ఏళ్లలో 8 రాష్ట్రాలకు విస్తరించడం చిన్న -

మిగతా3లో



## జంతర్ మంతర్

# ప్రొటెస్ట్

- మహిళా నిరసనకారుల ఫిర్యాదులకే మొదటి ప్రాధాన్యత: సుప్రీంకోర్టు
- జంతర్ మంతర్ నిరసనలు
- మహిళల ఫిర్యాదులకే మొదటి ప్రధాన్యత ఇవ్వాలని విచారణ కమిటీకి సీజేఐ ఆదేశం



## భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?

- రాహుల్‌పై సీఎం యోగి ఫైర్
- రాహుల్ గాంధీపై యోగి ఆదిత్యనాథ్ ఘాటు విమర్శలు
- మనుస్మృతిపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన యూపీ సీఎం
- రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి భారత సంప్రదాయాలను అవమానిస్తున్నారని ఆరోపణ

## కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు

- ట్రంప్ సంచలన నిర్ణయం
- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమలు
- కెనడా వల్లే తమకు వాణిజ్య లోటు వస్తోందన్న ట్రంప్
- అమెరికా నిర్ణయంపై ప్రతీకార చర్యలకు కెనడా సిద్ధం



## రాజకీయాలకు అతీతంగా

# అభివృద్ధి

- పులివెందుల దాహార్తికి శాశ్వత పరిష్కారం: పవన్ కల్యాణ్
- జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పనులకు వేగం
- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులకు తిరిగి ప్రాణం
- పులివెందులలో రికార్డు స్థాయిలో 96 శాతం పనులు పూర్తి



**అమరావతి**

దశాబ్దాలుగా నెలకొన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజకీయాలకు అతీతంగా ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా 'జల్ జీవన్ మిషన్–అమరజీవి జలధార' ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తోంది. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పనులను తిరిగి ప్రారంభించి రికార్డు వేగంతో పూర్తి చేస్తోంది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో ఏకంగా 96 శాతం పనులు పూర్తి చేసినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ఏడు మండలాల పరిధిలో సుమారు ఐదున్నర లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరి దాహార్తిని తీర్చే లక్ష్యంతో 'పులివెందుల మెగా వాటర్ గ్రిడ్' పథకానికి గతంలో రూపకల్పన చేశారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద రూ. 480 కోట్ల అంచనా

- మిగతా3లో

## స్థానిక పోరుకు

# రంగం సిద్ధం



- స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం
- ఇలాంటివి నమ్మొద్దు: ఎస్ఈసీ పునేఠా
- అధికారిక ప్రభుత్వ గుర్తులను సైతం దుర్వినియోగం చేస్తూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తున్నారు
- ఆ వార్తలను ప్రజలు ఏమాత్రం నమ్మవద్దు
- ప్రకటనలో తెలిపిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్‌చంద్రపునేఠా

**అమరావతి**

రాష్ట్రంలో జరగనున్న గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న షెడ్యూల్ పూర్తిగా నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్‌చంద్రపునేఠా స్పష్టం చేశారు. అధికారిక ప్రభుత్వ గుర్తులను సైతం దుర్వినియోగం చేస్తూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తున్నారని, ఆ వార్తలను ప్రజలు ఏమాత్రం నమ్మవద్దని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఎన్నికల తేదీలు, షెడ్యూల్ నిజమేనా అంటూ వివరణ కోరుతూ కమిషన్ కార్యాలయానికి పెద్ద ఎత్తున ఫోన్ కాల్స్ వస్తున్నాయని అనీల్‌చంద్రపునేఠా గుర్తు చేశారు. ప్రచారంలో ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని, ఎలాంటి ధ్రువీకరణ లేని ఇటువంటి వార్తలను ఇతరులకు ఫార్వార్డ్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సృష్టించి, ప్రజలను గందరగోళానికి గురి చేసే వారిపై సైబర్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలకు సంబంధించిన ఏ విధమైన అధికారిక

- మిగతా3లో

## ఎల్‌నినో దృష్ట్యా కృష్ణా జలాలను

# తాగునీటికే వాడుకోవాలి

- సూత్రప్రాయంగా నిర్ణయించిన కేఆర్ఎంబీ
- హైదరాబాద్‌లో ముగిసిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం
- ఈ ఏడాది నీటి పంపకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోని కమిటీ
- మళ్లీ సెప్టెంబర్ 4న భేటీ కావాలని కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నిర్ణయం
- కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం నిర్ణయాలు



## ఏపీలో ఫ్రెండ్లీ పోటీ తప్పదా

**విజయవాడ:** రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా?రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా ఉన్న స్థానిక వర్గ పోరాటాలు, వ్యక్తిగత పట్టు ఈ ప్రక్రియను సంక్లిష్టం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నాయకుడూ తన సొంత ఉనికిని కాపాడుకోవాలని భావించడం వల్ల పార్టీ అధిష్ఠానాల నిర్ణయాలకు లోబడి సీట్లను త్యాగం చేయడం క్షేత్రస్థాయి కేడర్‌కు కష్టతరంగా మారుతోంది.గ్రామ రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న స్థానిక ఆధిపత్య పోరాటాలు కూటమి ఐక్యతకు ప్రధాన పరీక్షగా మారాయి. ఒకే పంచాయతీ లేదా వార్డులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి బలమైన నాయకులు ఉండటం వల్ల, ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా రెండో వర్గంలో తీవ్ర అసంతృప్తి చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో తమ ఉనికి కోల్పోతే భవిష్యత్ రాజకీయ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని కింది స్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. అధిష్ఠానం ఒత్తిడి తెచ్చినా స్థానికంగా సర్దుబాటు కావడం అసాధ్యమని భావించే ప్రాంతాల్లో స్వతంత్రులుగానైనా బరిలోకి దిగాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.అధికారికంగా ఒకే అభ్యర్థిని బలవంతంగా రుద్దడం కంటే స్నేహపూర్వక పోటీలు ఖాయంగా కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ చిహ్నాల ప్రాతిపదికన జరగకపోవడం కూడా క్షేత్రస్థాయి నాయకులకు తమ వ్యక్తిగత బలాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు కూటమి పార్టీల నేతలు బరిలో ఉన్నప్పటికీ, ప్రచారంలో హద్దులు దాటకుండా విపక్ష వైఎస్సార్‌సీపీకి మైలేజ్ రాకుండా చూసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.కూటమి అధిష్ఠానానికి స్థానిక సమన్వయం అతిపెద్ద పరీక్షగా నిలవనుంది. సమన్వయ కమిటీల ద్వారా సర్దుబాటు ప్రక్రియను ముందస్తుగానే పూర్తి చేయడం, నామినేటెడ్ లేదా ఇతర స్థానిక పదవుల హామీలతో అసంతృప్త నేతలను బుజ్జగించడంపై నాయకత్వం దృష్టి సారించింది. కింది స్థాయిలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అది ప్రభుత్వంపై ఉన్న సానుకూలతను ప్రభావితం చేస్తుందనే భావనతో, ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా రంగంలోకి దిగి సర్దుబాటు చేసే ప్రయత్నాలు గట్టిగా చేయాల్సి ఉంది.

## స్థానిక పోరుకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి



సమాచారమైనా కమిషన్ నేరుగా పత్రికా ప్రకటన లేదా మీడియా సమావేశం ద్వారా మాత్రమే ప్రజల దృష్టికి తీసుకువస్తుందని పునేఠా స్పష్టం చేశారు. అనధికారిక వనరులు, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే సమాచారాన్ని అధికారికమైనదిగా పరిగణించరాదని కోరారు. తదుపరి అధికారిక ప్రకటన వెలువడే వరకు ప్రజలు ప్రజాప్రతినిధులు ధ్రువీకరించిన అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని సూచించారు.
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి.
డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లోనే వంద చోట్ల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది.

# స్థానిక ఎన్నికల్లో వైసిపి వారసులు..



**గుంటూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. అక్కడ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? పర్వాలేదు. లేకుంటే పార్టీని వదిలి సేఫ్ జోన్ లో తమ వారసులను నిలపాలన్న ఆలోచనతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికలు దాటితే చాలామంది ఏడుపదుల వయసు దాటుతారు. అప్పటికి తమ వారసుల రాజకీయ భవిష్యత్తు సెట్ అవుతుందా? లేదా? అనే అనుమానంతో ఉన్నారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ధర్మాన బ్రదర్స్, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం లాంటి నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే తమ పిల్లలకు టికెట్లు ఇవ్వాలని ధర్మాన బ్రదర్స్ కోరారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదు. అయితే ఇప్పుడు 2029 ఎన్నికల వరకు వేచి చూసే కంటే.. స్థానిక ఎన్నికల్లోనే తమ పిల్లలను బరిలో దించాలని ధర్మాన బ్రదర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన కృష్ణ దాస్ కుమారుడిని జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. ధర్మాన ప్రసాదరావు కుమారుడ్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ గాను రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అక్కడ వచ్చే ఓట్ల ప్రభావం, ఫలితాలను అంచనా వేసుకుని 2029 ఎన్నికల నాటికి ఏదో ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలన్నది ధర్మాన బ్రదర్స్ ఆలోచనగా తెలుస్తోంది.శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయినా సరే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దానికి కారణం వారసులను రాజకీయంగా సెట్ చేయడమే. కుమార్తెతో పాటు కుమారుడు ఇద్దరూ వైద్యులే. కానీ ఇంతవరకు వారు పొలిటికల్ గా సెట్ కాలేదు. అందుకే తన కుమార్తె డాక్టర్ అనూషను జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. కుమారుడు సందీప్ ను చీపురుపల్లి ఎమ్మెల్యే గారు చూడాలనుకుంటున్నారు బొత్స. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో తన కుమార్తె పేరును జిల్లా పరిషత్ చైర్పర్సన్ పదవి కోసం జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. మరోవైపు తాను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే తన కుమారుడికి జిల్లా పరిషత్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు తమ్మినేని. అయితే ఈ సీనియర్లంతా అంతిమంగా ఒకటే ఆలోచన చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓట్లు, గ్రాఫ్ పెరిగితే పరవాలేదు.. లేకుంటే మాత్రం పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోవడమనే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# టూ, త్రీ సిటీస్‌లో హోమ్ స్టేలు




**విజయవాడ :** ఏపీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేస్తోంది. పట్టణాల్లో హోమ్ స్టేలను తీసుకువచ్చే ఆలోచనలో ఉంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ హోం స్టేలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నిర్ణయించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. పట్టణాల్లో హోం స్టేలను గుర్తించే పనిలో ఉన్నారు అధికారులు. ఎవరికైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. సాధారణంగా పట్టణాలకు పనులపై వచ్చేవారు ఉంటారు. నగరాలకు సంబంధించి సందర్శనకు, ఆలయాలకు, పర్యటనల కోసం వస్తుంటారు. అటువంటి వారికి తక్కువ ఖర్చుతో వసతితో పాటు భోజనం అందించేలా ఈ హోమ్ స్టేలను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధపడుతోంది ఏపీ ప్రభుత్వం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచేలా ఏర్పాట్లు చేస్తోంది.విశాఖ నగరాన్ని తీసుకుందాం. ఇక్కడకు చాలామంది పర్యాటకులు వస్తుంటారు. వారికి సరైన వసతి ఎక్కడ దొరుకుతుందో తెలియదు. అందుకే అధిక ధర వెచ్చించి హోటల్ గదుల్లో దిగుతుంటారు. అటువంటి వారికి ఇబ్బంది లేకుండా ఈ హోం స్టేలను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది అనేది రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం. మరోవైపు సంక్రాంతి సంబరాల సమయంలోనూ వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడే ఉండి సంక్రాంతి వేడుకలను తిలకిస్తుంటారు. అయితే బంధుమిత్రులు ఉన్నవారు పర్వాలేదు కానీ.. లేని వారికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అటువంటి సమయంలో ఈ హోం స్టేలు అనేవి ఎంతగానో దోహదపడతాయి. సాధారణంగా ప్రముఖ ఆలయాలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. వాటిని సందర్శించే సమయంలో సైతం వసతి సమస్య ఏర్పడుతుంది. అటువంటి వారికి సైతం హోమ్ స్టేలు ఎంతగానో ఉపయోగపడతాయి.తక్కువ ధరకు పర్యాటకులకు వసతి కల్పించడంతో పాటు.. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలి అనేది ఈ హోం స్టేల ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో పట్టణాల్లో హోం స్టేలు సిద్ధం చేసేలా కసరత్తు జరుగుతోంది. అయితే స్థానికంగా ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు వారికి వివరించేలా బాధ్యతను కూడా అప్పగిస్తారు. ఎక్కడో అద్దెకు ఉన్నాం అన్న భావన లేకుండా.. అతిధులు మాదిరిగా ఆతిథ్యం పొందే వీలుగా ఈ హోం స్టేలు ఏర్పాటు చేయనున్నారు. ఎవరైనా ఆసక్తి ఉండి దరఖాస్తు చేసుకుంటే ముందుగా ఆ ఇళ్లను అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారి సత్ప్రవర్తన కూడా పరిశీలించనున్నారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు కూడా ఉండకూడదు. అలాగే అతిధులకు సదుపాయాలు, గౌరవంగా వ్యవహరించడం వంటి అంశాలపై నిర్వాహకులకు శిక్షణ ఇవ్వనున్నారు హోమ్ స్టేకు కనీసం ఒక బెడ్ రూమ్ రెండు పడకలతో.. గరిష్టంగా ఆరుగదులు 12 బెడ్లతో ఉండాలి. సదరు ఇంటి యజమాని తన కుటుంబంతో అదే ప్రాంతంలో నివాసం ఉండాలి. ఒకవేళ అనుబంధంగా ఉండే బెడ్, బ్రేక్ ఫాస్ట్ కోసం యజమాని, ప్రమోటర్ అదే ప్రాంతంలో నివా నివాసం ఉండాల్సిన అవసరం లేదు. అటువంటి వారు అతిధులకు అవసరం అయినా సేవలు అందించేందుకు ఒక ప్రతినిధిని నియమించుకోవాల్సి ఉంటుంది. కాగా దాదాపు అన్ని ప్రముఖ పట్టణాల్లో మెప్మా అధికారులు అప్పుడే కసరత్తు ప్రారంభించారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

వ్యయంతో పనులు ప్రారంభించింది. కేంద్రం నిధులు సమృద్ధిగా మంజూరు చేసినా, గత ప్రభుత్వ హయాంలో పనులు మాత్రం ముందుకు సాగలేదు. ఈ ప్రాజెక్టు పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేవలం అరకొరగా పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి చేయలేదు. పైగా, జరిగిన ఆ కాస్త పనుల్లోనూ కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి.

### మరో నాలుగేళ్లు పొడిగింపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాన్ని ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అయితే అప్పటికే జల్ జీవన్ మిషన్ గడువు ముగిసిపోయింది. దీనివల్ల కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వెంటనే రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్, కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. ఆయన చేసిన ప్రత్యేక ప్రయత్నాలతో జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించి అంగీకారం తెలిపింది. దీంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకానికి మళ్లీ ఊపిరి పోసినట్లయింది.

### 96 శాతం పనులు పూర్తి

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు పవన్ కల్యాణ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గాడి తప్పిన పనులను దారిలోకి తెచ్చి, పనులు వేగవంతంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించారు. ఆయన నిబద్ధత ఫలితంగా ప్రాజెక్టులో రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఒక్క పులివెందుల తాగునీటి పథకానికే దాదాపు రూ. 280 కోట్లు కేటాయించి పనుల్లో వేగం పెంచారు. ప్రస్తుతం పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఈ పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందుతోంది. అటు లింగాల మండలం పరిధిలోని 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలోనే తాగునీరు అందనుంది.

### తుది దశకు చేరిన నిర్మాణాలు

ఈ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణానికి గాను ఏకంగా 1,106 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజలకు ప్రాథమిక అవసరమైన తాగునీటిని అందించేందుకు, రాజకీయాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని స్పష్టం చేసింది. ఈ దిశగా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఈ మెగా వాటర్ గ్రిడ్ పనులను శరవేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

## ఎల్‌నినో దృష్ట్యా కృష్ణా జలాలను తాగునీటికే వాడుకోవాలి

హైదరాబాద్ జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. కేఆర్‌ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు, ఏపీ తరపున ఈఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చారు.




### 47 ౹వీజలకు సూత్రప్రాయంగా అంగీకరం

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఈ ఏడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించగా ఏపీ తరపున అక్టోబర్ వరకే ప్రతిపాదించినట్లు ఏపీ జుచీజ నరసిం హమూర్తి తెలిపారు. అప్పటివరకు 47 ౹వీజలు అడిగామని ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెప్పారు. రెండురాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని సెప్టెంబర్ 4న మరోసారి సమావేశమై చర్చిస్తామని జుచీజ నరసింహమూర్తి స్పష్టం చేశారు.

### ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే

సాగర్, శ్రీశైలం నీటి వాటాలపై చర్చించామని తెలంగాణ ఈఎన్‌సీ రఘువర్ధన్ తెలిపారు. ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే వాడుకోవాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుందని అన్నారు. తాగునీటికి 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పామని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీరు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.
"ఎల్‌నినో దృష్ట్యా శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను తాగునీటినే వాడుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించాం. ఏడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించింది. మేం అక్టోబర్ వరకే ప్రతిపాదించాం. అప్పటివరకు 47 టీఎంసీలు అడిగాం, సూత్రప్రాయంగా అంగీకరించారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదు. సెప్టెంబర్ 4న మళ్లీ సమావేశమై చర్చిస్తాం." "నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో నీటి వాటాలపై చర్చ జరిగింది. ఎల్?నినో పరిస్థితుల దృష్ట్యా త్రాగునీటి కోసం మాత్రమే నీటిని వాడుకోవాలని త్రిసభ్య కమిటీలో నిర్ణయించారు. తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పాం. ఏపీ పోతిరెడ్డి పాటు నుంచి ఎక్కువ నీరు వాడుకొందని ఫిర్యాదు చేశాం. సెప్టెంబర్ 4వ తేదీన తాగునీటి అవసరాలపై మాత్రమే చర్చ ఉంటుంది. భవిష్యత్‌లో ప్రవాహాలు వస్తే తదుపరి ఆలోచిస్తాం."

### సెప్టెంబర్ 4న మరోసారి భేటీ

తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో నేడు ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. తాగునీటి కోసం చెరి సగం వాడుకోవాలని సమావేశంలో ప్రస్తావించింది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్? 4న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు.

## భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే గుర్తొచ్చేది ముసునూరే

-మొదటిపేజీ తరువాయి

విషయం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. రోజుకు 29 టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ ప్రాసెసింగ్ కేంద్రం ఆసియాలోనే అతిపెద్దదని, 69 శాతం మార్కెట్ వాటా సాధించడం గర్వకారణమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. "మన ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లే వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. స్వదేశీ విధానంతో స్వయం సమృద్ధి సాధించాలి. మన ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లే వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి"

### రైతు ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం

ఉపరాష్ట్రపతి సీ.పీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ రైతులే దేశానికి వెన్నెముక అని అన్నారు. కాలానికి అనుగుణంగా పంటలు పండిస్తూ దేశానికి అన్నం పెట్టేది రైతేనని కొనియాడారు. విత్తనం నుంచి పంట కోత వరకు సాగే వ్యవసాయ చక్రం ఆధారంగానే మన పండుగలు ఏర్పడ్డాయని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ కాలాల్లో పంటల పండుగలు జరుపుకోవడం భారత వ్యవసాయ సంస్కృతికి నిదర్శనమన్నారు.
దేశంలోని శ్రామిక శక్తిలో 46.1 శాతం మందికి వ్యవసాయ రంగమే ఉపాధి కల్పిస్తోందని, దాదాపు 55 శాతం జనాభాకు జీవనాధారంగా వ్యవసాయం కొనసాగుతోందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. రైతులు సాధించిన ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి


### -విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.. పలు పాఠశాలలు మూతపడే పరిస్థితి: జడ్పీటీసీ తాటిగుట్ల శివప్రసాద్‌రెడ్డి



వేంపల్లె ఆగస్టు 24 (కదిలించే వార్త):

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుండటంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని చక్రాయపేట జడ్పీటీసీ తాటిగుట్ల శివప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం వేంపల్లెలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చక్రాయపేట మండలంలో గతంలో 58 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, విద్యార్థుల సంఖ్య లేక ఇప్పటికే ఆరు పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ప్రస్తుతం కూడా కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అతి తక్కువగా ఉండటంతో మరికొన్ని పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండటంతో పాఠశాలలు వెలవెలబోతున్నాయని అన్నారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. చక్రాయపేట, వేంపల్లె మండలాల పరిధిలోని గ్రామాల్లోకి ప్రైవేటు పాఠశాలల బస్సులు రావడంతో పాటు, మెరుగైన విద్య అందుతుందనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గతంలో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నికల సమయంలో నాయకులను కోరుకునేవారని, ప్రస్తుతం అనేక గ్రామాల్లో పాఠశాలలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిలో పిల్లలను చేర్పించే పరిస్థితి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు వేలాది రూపాయల జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు మౌలిక వసతులను బలోపేతం చేయాలని జడ్పీటీసీ సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై కూటమి ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించి, పాఠశాలలను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని, తద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని తాటిగుట్ల శివప్రసాద్‌రెడ్డి కోరారు.

## మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



పులివెందుల అర్బన్ కదిలించే వార్త ఆగస్టు 24

పులివెందుల పట్టణలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సోమవారాన్ని పురస్క రించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుం డి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అ భిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయం లో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. శ్రావణ మాసం సోమవారాన్ని పురస్కరిం చుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరిగిందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు, ఎండోమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నరు.

## పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

### -ఆగస్టు 25, 26న రిజ్యూమ్‌ల సమర్పణ.. 27న ఇంటర్వ్యూ



వేంపల్లె ఆగస్టు 24 (కదిలించే వార్త):

వేంపల్లెలోని వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుకు గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ రిజ్యూమ్‌లను ఆగస్టు 25, 26 తేదీల్లో కళాశాలలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 27న కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఏ.లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎన్ ఈ టి , ఎస్ ఈ టి , పి. హెచ్. డి . అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ అసలు విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో రిజ్యూమ్‌లు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉషశ్రీ కోరారు.

## విజిబుల్ పోలీసింగ్.. ఆక్రమణల తొలగింపు

### - ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఫుట్ పెట్రోలింగ్.. రహదారులపై పోలీసుల నిఘా







వేంపల్లె ఆగస్టు 24 (కదిలించే వార్త):

పట్టణంలో ట్రాఫిక్ రాకపోకలు సజావుగా సాగేందుకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించినట్లు వేంపల్లె సీఐ టీ. నరసింహులు తెలిపారు. సోమవారం ప్రభుత్వ హైస్కూల్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న తాత్కాలిక దుకాణాలు, తోపుడు బండ్లు, ఇతర ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ రాకపోకలకు మార్గం సుగమం చేసినట్లు సీఐ తెలిపారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని సీఐ నరసింహులు తెలిపారు. రహదారులపై ఆక్రమణలకు పాల్పడకుండా వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు సహకరించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత విస్తృతం చేస్తామని సీఐ టీ. నరసింహులు స్పష్టం చేశారు.

## అంబేద్కర్ చూపిన మార్గంలో పయనించాలి

### -ఏఎంఎల్ నగర్‌లో పండుగ వాతావరణంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

### -బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్



బద్వేల్ బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 24

అణగారిన వర్గాల అభ్యున్నతికి, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభంగా నిలిచిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వేసిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ పిలుపునిచ్చారు. కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని ఏఎంఎల్ నగర్‌లో సోమవారం పండుగ వాతావరణంలో ఏర్పాటు చేసిన 6 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆర్డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ... ఏఎంఎల్ నగర్ కాలనీ వాసులు 2016 నుండి అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన సూక్తులను పాటిస్తూ వస్తుండటం ఎంతో అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలు శ్రమించి స్థలాన్ని కేటాయించుకుని, ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

**విద్యతోనే అంబేద్కర్ కలలుగన్న రాజ్యం సాధ్యం:**

బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గం కేవలం ఒక వర్గానికి మాత్రమే కాదని, మానవాళి అంతటికీ దిశా నిర్దేశమని ఆర్డీఓ కొనియాడారు. "చదువుకోవడమే అంబేద్కర్ మనకిచ్చిన అతిపెద్ద ఆయుధం. కాలనీలోని ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. అప్పుడే అంబేద్కర్ కలలుగన్న సమసమాజ స్థాపన మరియు రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన సాధ్యమవుతాయి" అని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో మార్పు విజ్ఞానంతోనే ప్రారంభమవుతుందని, తల్లిదండ్రులు పిల్లల చదువుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముందుగా కాలనీ ప్రజలు ఆర్డీఓ చంద్రమోహన్‌ను పూలమాలలు, శాలువాలతో ఏ ఎమ్ ఎల్ కాలనీ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కాలనీ పెద్దలు పి. మౌలాలి, ఏసోబు, చిన్నయ్య, లక్ష్మయ్య, నరసింహులు, జయరాజు, నాగరత్నమ్మ, దారా ప్రసాద్‌లతో పాటు కాలనీ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యసాధనలో అంతరిక్ష పాత్ర విశిష్టమైనది

### - ప్రొఫెసర్ కె శేష మహేశ్వరమ్మ వైస్ ప్రిన్సిపల్ జేఎన్టీయూ



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 24 కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా పులివెందుల ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో "వికసిత్ భారత్ కోసం అంతరిక్ష సాంకేతికత "అంశం మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేయడమైనది కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి .శ్రీనివాసులు తెలియజేశారు .ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ .కే .శేష మహేశ్వరమ్మ మాట్లాడుతూ, చంద్రయాన్ త్రీ ద్వారా విజయవంతంగా ప్రయోగించబడిన సందర్భమును ఆధారం చేసుకొని జాతీయ అంతరిక్ష దినోత్సవం ఏర్పాటు చేయడమైనదని, యువతలో సైన్స్ మరియు అంతరిక్ష విజ్ఞానం మీద ఆసక్తిని పెంచాలని ,వికసిత్ భారత్ లక్ష్యసాధనలో అంతరిక్ష రంగం పాత్ర ముఖ్యమైనదని వివరించారు. ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల లో వాతావరణం, వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు, నిరుద్యోగం పట్ల కలిగే దుష్ఫలితాలను నివారించుటకు, యువత నూతన ఆవిష్కరణలు, సహకారాన్ని పెంపొందించుట, స్థిరీకరణ వంటి విషయాలపట్ల అవగాహన కలిగి దేశ పురోగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తదుపరి భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన విభిన్న పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు .ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ యు. శ్రీనిత భౌతిక శాస్త్ర విభాగాధిపతి శ్రీ .ఎన్ .శివరామిరెడ్డి ,డాక్టర్ .ఎం. ఓబుల్ రెడ్డి ,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థినిలు పాల్గొన్నారు..

## నేత్రదానం మహాదానం

### -అంధకారంలో ఉన్నవారికి చూపును ప్రసాదించండి!

### -నేటి నుండి జాతీయ నేత్రదాన పక్షయోత్సవాలు

### -మరణానంతరం కూడా మన చూపుతో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 24

సృష్టి అందాలను ఈ అందమైన ప్రపంచాన్ని కనులారా చూడలేని నిస్సహాయుల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ప్రతి ఏటా నిర్వహించే జాతీయ నేత్రదాన పక్షయోత్సవాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రతి ఒక్కరిలో నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించి, అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక పక్షోత్సవాలను కొనసాగిస్తున్నారు.

**అపోహల తొలగింపు:-**

మరణం తర్వాత కళ్లను దానం చేస్తే ముఖం వికృతం అవుతుందనే అపోహలను వైద్య నిపుణులు మరియు స్వచ్ఛంద సంస్థలు పూర్తిగా ఖండిస్తున్నాయి. మరణించిన 6 గంటల లోపు సేకరించిన నేత్రాలు ఇద్దరు అంధుల జీవితాలకు వెలుగునిస్తాయని స్పష్టం చేస్తున్నారు.

**కార్యక్రమాల నిర్వహణ:-**

ఈ పక్షోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, సామాజిక సేవా సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవ హారాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

**రిజిస్ట్రేషన్ల పెంపు:-**

ఆసక్తి గల ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లేదా స్థానిక కంటి ఆసుపత్రుల ద్వారా నేత్రదాన ప్రతిజ్ఞ చేసి, దాన పత్రాలు పొందాలని వైద్యులు కోరుతున్నారు.

**ఎవరు దానం చేయవచ్చు?**

లింగ, వయసుతో సంబంధం లేకుండా కంటిశుక్లం కళ్లద్దాలు వాడేవారు, బీపీ, షుగర్ వంటి సాధారణ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు కూడా నేత్రదానం చేయడానికి అర్హులే. అయితే, ఎయిడ్స్, జాండిస్, రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులతో మరణించిన వారి నేత్రాలను సేకరించరు.

**సమాజం బాధ్యత:-**

మనం మరణించినా మన కళ్ళు ఈ లోకాన్ని చూస్తూనే ఉండాలి" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. బంధువులు మరణించినప్పుడు వారి కుటుంబ సభ్యులు చొరవ తీసుకొని నేత్రదానానికి అంగీకరిస్తే, అది ఇద్దరు అంధుల జీవితాల్లో చీకటిని తరిమివేస్తుంది. ఈ పక్షోత్సవాలను విజయవంతం చేసి, నేత్రదానాన్ని ఒక సామాజిక ఉద్యమంగా మారుద్దాం!

## ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న భాగవత సప్తాహం కార్యక్రమం.



వీరపునాయునిపల్లి కదిలించే వార్త ఆగస్టు 24

కడప జిల్లాలో మండల కేంద్రమైన వీరపునాయునిపల్లి గ్రామంలో సోమవారం నుంచి భాగవత సప్తాహం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రాజ్యసభ మాజీ సభ్యులు,ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మొదటి రోజు ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు అన్నీ ఉండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రాలు,భాగవత సప్తాహం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆధ్యాత్మికవేత్తలైన భాగవతులతో సమాలోచనలు నేటి మానవునికి ప్రశాంతిని కలిగిస్తాయన్నారు. పురాణ ఇతిహాసాలు సమాజానికి నిత్య చైతన్య దీపికలు, దిక్సూచికలు. రామాయణం ఒక ఆదర్శ కావ్యం. మహాభారతం ఒక ధర్మ శాస్త్రం. శ్రీమద్ మహా భాగవతం మోక్షశాస్త్రమని తులసి రెడ్డి వివరించారు. శ్రీ మహావిష్ణువు దశావతారాల వర్ణనా వైభవమే మహాభాగవతం అన్నారు. ప్రహ్లాదుడు, ధ్రువుడు, ముచికుందుడు,అంబరీషుడు, కుచేలుడు, గజేంద్రుడు తదితర భాగవతోత్తముల గాథల ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించే మోక్షశాస్త్రం భాగవతం అన్నారు. భాగవతాన్ని భక్తిశ్రద్ధలతో వారం రోజులపాటు పఠించినా,ఆలకించినా మోక్ష ప్రాప్తి కలుగుతుందని ప్రతీతి. కలియుగ ఆరంభంలో పవిత్ర గంగానది తీరాన శుక మహర్షి అధ్యక్షతన పరీక్షిత్తు మహారాజు నిర్వహణలో మొట్టమొదటి భాగవత సప్తాహం జరిగిందని, ఈ సప్తాహం కార్యక్రమం కారణంగా పరీక్షిత్తు మహారాజుకు మోక్ష ప్రాప్తి కలిగిందని ప్రతీతి. అటువంటి పవిత్ర కార్యక్రమాన్ని వీరపునాయునిపల్లి గ్రామానికి చెందిన భాగవతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగవతులు సరోజమ్మ, రాధమ్మ,ఆంజనేయ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి, గంగిరెడ్డి,నరసింహారెడ్డి ఐచర్ రమణ చిన్నకోట్ల నాగరాజు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వీరపునాయుని పల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది.



# అంతంత మాత్రంగా పారిశుద్ధ్య పనులు నిర్వహణలోపమా, నిర్లక్ష్యమా?



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 24

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సేవలు అంతంత మాత్రం గానే కొనసాగడానికి కారణం నిర్వహణలోపమా లేక నిర్లక్ష్యమా లోపమా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. వివరాలలోకి వెళ్తే పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన తరువాత ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ పనులలో అలసత్వం, ప్లాస్టిక్ కవర్ల పట్టివేతలో నిర్లక్ష్యం, హోటళ్లపై పర్యవేక్షణ లేని కారణంగా వినియోగదారులు మరియు ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని ప్రాంతాలలో చెత్త బండి సేకరణ వాహనాలు నిర్ణీత కాలంలో రాకపోవడంతో చెత్త ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని, పురపాలక సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటనలు లేని కారణంగా సమస్యలను పరిష్కరించే ప్రయత్నంలో లోపాలు చోటు చేసుకోవడం పట్ల ప్రజలు ఆవేదన చెందుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇచ్చి క్లీన్ మున్సిపాలిటీకి అధికారులు మరింత పాటుపడాలని ఆకాంక్షిస్తున్నారు.

# విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి

## -మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



తొండూరు కదిలించే వార్త ఆగస్టు 24

అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు-నైతిక విలువలు అనే అంశంపై మానవతా ప్రతినిధులు వ్యాస రచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్ ఫైళ్లను బహుకరించారు. ఈ సమావేశంలో సెల్ ఫోన్ వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేసి గొప్ప వ్యక్తుల యొక్క జీవిత చరిత్ర లను చదవమని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ డి. వి.కొండారెడ్డి అధ్యక్షులు చవ్వా కృష్ణా రెడ్డి, కార్యదర్శి పి.గురుప్రసాద్ ,కన్వీనర్ బి.వి. క్రిష్ణా రెడ్డి , డైరెక్టర్ శ్రీ యన్.ఎస్. శంభురెడ్డి,సంస్థ ప్రతినిధి పి.సోమశేఖర్ రెడ్డి రిటైర్డ్ హెడ్ మాస్టర్ శ్రీ ఎస్. ఇమామ్ భాష ,మాజీ సర్పంచ్ యమ్. చంద్రమౌళీశ్వరరెడ్డిమరియు ప్రధానోపాధ్యాయులు సి.బాబు రెడ్డి సీనియర్ ఉపాధ్యాయులు జి.రాజా,పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# కడపలో క్రీడా రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి

## -కమలాకర్ రావు విజయ జ్యోతి



కడప, ఆగస్టు 24: కదిలించే వార్తకడప జిల్లాలో క్రీడా రంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ క్రీడల విభాగం రాష్ట్ర అధ్యక్షులు కమలాకర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి, కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్ చేశారు.కడప వైఎస్సార్ స్టేడియంలో సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి చేసిన హాకీ గ్రౌండ్‌ను వెంటనే ప్రారంభించాలని, వినియోగంలో లేని స్విమ్మింగ్ పూల్, జిమ్నాస్టిక్స్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రజాధనంతో నిర్మించిన క్రీడా మౌలిక వసతులు నిరుపయోగంగా ఉండటంతో క్రీడాకారులు నష్టపోతున్నారని అన్నారు.క్రీడాకారులకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు క్రీడా రంగంలోని అవకతవకలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. క్రీడాకారులకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ పార్టీ వారి తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు.అనంతరం క్రీడా కమిటీల ఏర్పాటుపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

## - ప్రగతిశీల విద్యార్థి సమైక్య (పిఎస్‌ఎఫ్) డిమాండ్

కడప ఆగస్టు 24 కదిలించే వార్తనిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలపై సమగ్ర విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సమైక్య (పి ఎస్ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కొడవటికంటి నాగరాజు డిమాండ్ చేశారు.కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున నాయుడుకు పిఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఒకే భవనం లేదా క్యాంపస్‌లో రెండు, మూడు నర్సింగ్ కళాశాలలు నిర్వహిస్తున్న సందర్భాల్లో అనుమతులు, మౌలిక వసతులు, సీట్ల సామర్థ్యం, అఫిలియేషన్ తదితర అంశాలపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిబంధనలు ఉల్లంఘించే కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నాగరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో హరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# సమాజ సేవ లో బ్రహ్మకుమారీస్ పాత్ర ప్రత్యేకం

## -రక్తదాన శిబిరానికి విశేష స్పందన ఆహ్వానించదగ్గ పరిణామం

## -వైయస్ మనోహర్ రెడ్డి



పులివెందుల, కదిలించే వార్త ఆగస్టు 24:

రక్తదానం మహాదానం అనే సందేశంతో పులివెందులలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం కావడంలో బ్రహ్మకుమారిస్ పాత్ర విశిష్టమైనదని పులివెందుల వైకాపా మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైయస్ మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని పిలుపునిస్తూ ఈ రకమైనటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న బ్రహ్మకుమారిస్ పాత్రను మరియు రక్తదానం చేసిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాధిక బ్రహ్మకుమారీ, వైకాపా పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, చాగలేటి రాయుడు, మానవతా కృష్ణారెడ్డి, డాక్టర్ కొండయ్య, యోగా గురువు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థకు 31 వినతులు

## - అదనపు కమిషనర్ శారదా దేవి



తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 24 ఆగస్టు

తిరుపతిలో నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 9 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 22 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు.కాగా భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని, వాటర్ కనెక్షన్ లేకున్నా బిల్ వస్తోంది సరిచేయాలని, అనారోగ్యం వలన విధులకు హాజరు కాలేక పోయాను, ఆరోగ్యం కుదుటపడినందున విధుల్లోకి తీసుకోవాలని, రవీంద్ర నగర్ లో తెలుగుగంగ పైప్ ల్నే మరమ్మతులకు తవ్వారు పూడ్చలేదని, ఆగిపోయిన సిసి రోడ్డు పూర్తి చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, సింగాల గుంటలో మా ఇంటికి దారిలేకుండా చేశారని, మాస్థలం ఆక్రమించి నిర్మాణాలు చేశారు సర్వే చేసి అక్రమ నిర్మాణాలు తొలగించాలని, తిలక్ రోడ్ నాగాలమ్మ గుడి వద్ద గుంతలు పూడ్చాలని, పాత మునిసిపల్ ఆఫీస్ వద్ద సిగ్నల్స్ మరమ్మతులు చేయించాలని, లక్ష్మీపురం వద్ద ఉన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ శుభ్రం చేయించాలని, శ్రీనివాస నగర్ ఎస్బిఐ కాలనీలో ప్లాట్ పామ్ ఆక్రమించారు పరిశీలించాలని, చేపల మార్కెట్ వినాయక స్వామీ గుడి వద్ద కుళాయి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, ఏసీపీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత మాటలు చెప్పి బీసీలను మోసం చేసిన కూటమి

## -బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## -వెన్నుపోటు పార్టీ వంచన పై బీసీ గర్జన

## -బీసీ గర్జనలో పాల్గొన్న బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరప్రసాద్



పులివెందుల అర్బన్ కదిలించే వార్త ఆగస్టు 24

బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వెన్నుపోటు పార్టీ వంచన పై అమరావతిలో బీసీ గర్జన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడువరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలకే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పెన్షన్ అందజేస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. బీసీ భవనాలు కమ్యూనిటీ హాళ్ళు వెంటనే నిర్మించలన్నారు. మోసపూరిత మాటలు చెప్పి బీసీలను మోసం చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తానని జీ ఓ 105 ఇవ్వడం జరిగిందని వెంటనే అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని చెప్పుకోవడమే తప్ప ఇంతవరకు బీసీలకు న్యాయం చేసిన దాఖలాలే లేవన్నారు. 105 జీవోపకారం 34 శాతం చేస్తే సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం ఇవ్వడం జరగదన్నారు .ఇది బి సి లను మోసం చేయడమే . వైకాపా ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, అప్పుడు కోర్టుకు పోయి ఆపింది మీ పార్టీ అనుచరులు కాదా అన్నారు. ఐనా కూడా జగన్ గారు మాట ఇచ్చిన ప్రకారం ఓ సి ల స్థానం లో బి సి లకు స్థానం కల్పించడం కల్పించి 34 శాతం రిజర్వేషన్లు కల్పించి బి సి ల మీద ఉన్న ప్రేమను చిత్త శుద్ధి తో నిరూపించు కున్నారు అలాగే మీరు కూడా బి సి లకు 34 శాతం ఇచ్చి మాట నిలుపుకోవాలన్నారు.ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అన్నిటిని వెంటనే నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సచివాలయ సిబ్బంది ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలి

## -మున్సిపల్ కమిషనర్ తనూజ





పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 24పులివెందుల పురపాలక పరిధిలో ఉన్నటువంటి సచివాలయాలలో సచివాలయం సిబ్బంది ప్రజాసేవకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా సోమవారం,పులివెందులమున్సిపల్ కమిషనర్ తనూజ వార్డు సచివాలయ సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తనూజ మాట్లాడుతూప్రతి వార్డు సచివాలయ ఉద్యోగి వారి వారి జాబ్ చార్ట్ ప్రకారం డ్యూటీ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా వారి సచివాలయ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ప్రజలకు అందు బాటు ఉంటూ వారి సమస్యలు వారి సచివాలయ ఉద్యోగి పరిధిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కూడ వారి సమస్యలను మొదటగా వార్డు సచివాలయ నందు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రెవిన్యూ హెచ్చరిక బోర్డులు ఉన్నట్టేటప్పుడు లేని పేర్లు ఈనాడు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలి.

## -కబ్జాదారులకు సహకరిస్తున్న ఇంటి దొంగలపై చర్యలు తీసుకోవాలి.

## -ఇన్చార్జి తాసిల్దార్ కి వినతిపత్రం సమర్పించిన సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు.




కడప ఆగస్టు 24 కదిలించే వార్త

మాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు ఉండగా మమ్మల్ని ఎవరు ఆపేది అంటూ రెవెన్యూ వారు వేసిన హెచ్చరిక బోర్డులను తొలగించి ఇస్టారాజ్యాంగ చెలరేగిపోతున్న కబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారికి సహకరిస్తున్న ఇంటి దొంగలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఉదయం ఆ పార్టీ నాయకులతో కలిసి రెవిన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి మరియు గోపవరం మండల ఇన్చార్జి తహసీల్దారు ఉదయభారతి కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గోపవరం రెవెన్యూ కార్యాలయంలో ఇంటి దొంగల పాత్ర ఎక్కువైందని, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న కొంతమంది సిబ్బంది ఇంటిగుట్టును బయటపెడుతూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని, వీరి సహకారంతోనే కబ్జాదారులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారని వారు ఆరోపించారు. ఈ మధ్యకాలంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ చేసిన పోరాటాల ఫలితంగా గోపవరం రెవిన్యూ గ్రామ పొలం 16, 64, 65, 168,234,1848,1852 తదితర సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములలో రెవిన్యూ వారు హెచ్చరిక బోర్డులు వేశారని, ఇప్పుడు ఆ హెచ్చరిక బోర్డులు కొంతమంది అధికార పార్టీ నేతలు మేము రప్పించుకున్న అధికారులు మాకు సహకరిస్తున్నారు మాకేంటి అడ్డు అంటూ తొలగించి ఇష్టారాజ్యంగా భూములను చదును చేస్తూ నిర్మాణాలు చేపడుతూ చెలరేగిపోతున్నారని తక్షణమే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ భూములలో హెచ్చరిక బోర్డులు నాటేటప్పుడు లేని పేర్లు ఈనాడు ఎలా వచ్చాయో ఎవరి సహకారంతో వచ్చాయో పూర్తి విచారణ చేసి ఇంటిదొంగలపై శాఖాపరమైన చర్యలు తీసుకుని హెచ్చరిక బోర్డులు తొలగించిన కబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి తమ చిత్తశుద్ధిని రెవెన్యూ అధికారులు నిరూపించుకోవాలని లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజు జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య నియోజకవర్గ పార్టీ కమిటీ సభ్యులు రామరాజు, సంజీవ రాయుడు, జయరామరాజు, కే బాబు, విజయరావు, చంద్రపాల్, మహబూబ్ బాషా, పోతురాజు రమణ, మూరా ఈశ్వర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి




కడప/రాజమండ్రి, ఆగస్టు 24: కదిలించే వార్త

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రిటైర్డ్ ఎస్సై సల్మాన్ రాజ్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా రాజమండ్రిలోని లయన్స్ క్లబ్‌లో "మాదకద్రవ్యాలు--విద్యార్థులపై ప్రభావం" అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సల్మాన్ రాజ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, చదువుపై ఆసక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, ప్రశాంత్ మాట్లాడుతూ విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరాను అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి ఆర్ఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు నూకరాజు, జిల్లా కార్యదర్శి అభిషేక్, శామ్యూల్, కౌశిక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# కందుకూరులో బైక్‌పై వచ్చి దారికాచి తాళిబొట్టు చైన్ స్నాచింగ్

అనంతపురం రూరల్, క్రైమ్, కదిలించే వార్త, ఆగస్టు 24 :

అనంతపురం రూరల్ మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో చైన్ స్నాచర్ విరుచుకుపడ్డాడు. సచివాలయం సమీపంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో నుంచి 3 తులాల బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కందుకూరుకు చెందిన బండి సువర్ణ అనే మహిళ వ్యవసాయ పొలంలో పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తోంది. కందుకూరు సచివాలయం సమీపంలోని రోడ్డుపైకి రాగానే, బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి అడ్రస్ అడిగే నెపంతో ఆమె వద్ద వాహనాన్ని నిలిపాడు. అనుమానాస్పదంగా మాట్లాడటానికి ప్రయత్నించడంతో ప్రమాదాన్ని పసిగట్టిన సువర్ణ వేగంగా ముందుకు నడవగా, ఆ దొంగ ఆమె వెనుకవైపు నుంచి వచ్చి మెడలోని 3 తులాల బంగారు తాళిబొట్టు చైన్‌ను లాక్కుని క్షణాల్లో ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. బాధితురాలు బండి సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే, అదీ సచివాలయం వంటి ముఖ్య ప్రాంతం వద్ద ఈ చైన్ స్నాచింగ్ జరగడంపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# 'నేతన్న సేవ'లో అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి న్యాయం చేయాలి

## పథకం అమలులో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 24 : 'నేతన్న సేవ' పథకం అమలులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి జిల్లాలోని అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. శ్రీరాములు డిమాండ్ చేశారు . ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. శ్రీరాములు మాట్లాడుతూ.. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చీరాలలో ప్రారంభించిన నేతన్న సేవ పథకం అమలులో అనంతపురం జిల్లాలో తీవ్ర అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. మగ్గాలు లేని అనర్హులకు కూడా రాజకీయ జోక్యం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకం ప్రయోజనాలు అందినట్లు ఆరోపించారు. రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న ప్రతి చేనేత కార్మికుడి ఇంటికి అధికారులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించాలని కోరారు. ఇంటి డోర్ నంబర్, మగ్గం ఉన్నదీ లేనిదీ ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే అర్హతను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. అర్హులైన చేనేత కార్మికుల ఖాతాల్లో ఒకేసారి రూ.25 వేల ఆర్థిక సాయం జమ చేయాలని, 2024--25 సంవత్సరాలకు సంబంధించిన బకాయి మొత్తాన్ని కూడా వెంటనే చెల్లించాలని కోరారు. చేనేత అనుబంధ, ఉపవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు కూడా రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేతన్న సేవ పథకాన్ని కుల కార్పొరేషన్ల ద్వారా కాకుండా నేరుగా హ్యాండ్లూమ్ శాఖ ఆధ్వర్యంలో అమలు చేయాలని సంఘం నాయకులు కోరారు. మొదటి విడతలో జరిగిన అవకతవకలపై జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన



చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండో విడత నిధులు ఎప్పుడు జమ చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని కోరారు. చేనేత కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అర్హులందరికీ పథకం వర్తించేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నెల్లూరు లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి గోవిందు, చేతివృత్తుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి. లింగమయ్య, సంఘ నాయకులు మధు, రామ్మోహన్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా "ఖేలో ఇండియా సంవాద్" ప్రధానమంత్రి తో మాట్లాడటానికి జిల్లాలో ఏర్పాట్లు





అనంతపురం, ఎస్కేయూ, కదిలించే వార్త, ఆగస్టు 24 :అనంతపురం: భారత హాకీ దిగ్గజం,మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 27న దేశవ్యాప్తంగా యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత భాగస్వామ్యం, క్రీడల అభివృద్ధి, దేశ నిర్మాణం ప్రధాన లక్ష్యాలుగా "ఖేలో ఇండియా సంవాద్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశ యువత, క్రీడాకారులు మరియు భారతదేశ భవిష్యత్తును ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల్లో "యువ కనెక్ట్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు క్రీడాకారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు మరియు స్థానిక నాయకులతో నేరుగా మమేకమై తమ అభిప్రాయాలు, ఆలోచనలు, సూచనలు మరియు ఆకాంక్షలను పంచుకునే అవకాశం కల్పించనున్నారు. గత 12 సంవత్సరాలలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ క్రీడా రంగంలో వచ్చిన మార్పులు, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి మరియు క్రీడా వ్యవస్థలో సాధించిన పురోగతిపై యువతతో చర్చించడంతో పాటు, భవిష్యత్తు భారత క్రీడా రంగంపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలలో ఒకటి. ఆగస్టు 27న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 1,600 ప్రాంతాల్లో పాల్గొనే 8 లక్షలకు పైగా యువతను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల యువతను ఒకే జాతీయ వేదికపైకి అనుసంధానం చేసే ఈ కార్యక్రమం ద్వారా యువతకు ప్రత్యేక అవకాశం లభించనుంది. ప్రధానమంత్రి ప్రసంగం అనంతరం స్థానిక స్థాయిలో యువతతో పరస్పర చర్చలు నిర్వహించనున్నారు. మై భారత్ వాలంటీర్లు మరియు స్థానిక క్రీడాకారుల మధ్య ప్రత్యేక యువత పరస్పర చర్చ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా దేశంలో గత 12 సంవత్సరాలలో క్రీడా మౌలిక వసతులు, క్రీడా పర్యావరణ వ్యవస్థలో వచ్చిన అభివృద్ధిపై చర్చించనున్నారు. అనంతరం స్థానికంగా హాజరయ్యే ప్రజాప్రతినిధులు యువతను ఉద్దేశించి ప్రసంగించి వారితో మమేకమవుతారు. అనంతరం సుమారు 15 నిమిషాల "యువ సంవాద్" నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యువత తమ ఆలోచనలు, సూచనలు మరియు భవిష్యత్ ఆకాంక్షలను పంచుకునే అవకాశం ఉంటుంది. యువ సంవాద్‌లో ప్రధాన అంశాలుయువ సంవాద్‌లో ప్రధానంగా క్రీడా వ్యవస్థ బలోపేతం, 2036 ఒలింపిక్స్ కోసం క్రీడా ప్రతిభను తీర్చిదిద్దడం, యువ నాయకత్వం మరియు పాలనలో యువత భాగస్వామ్యం, వికసిత్ భారత్ కోసం యువ సాధికారత వంటి నాలుగు అంశాలపై చర్చించనున్నారు. క్షేత్రస్థాయిలో క్రీడా సదుపాయాలు, కోచింగ్ మరియు అవకాశాలను మెరుగుపరచడం, శాస్త్రీయ పద్ధతిలో క్రీడా ప్రతిభను గుర్తించి క్రీడాకారులను తీర్చిదిద్దడం, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, పాలనలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, వాలంటీరింగ్ మరియు దేశ నిర్మాణ అవకాశాలతో యువతను అనుసంధానం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. యువత తమ సూచనలు, ఆలోచనలు మరియు భవిష్యత్ ఆకాంక్షలను మై భారత్ ద్వారా అందించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా కార్యక్రమ ప్రాంగణంలోనే యువత ఎdూణ ာబఱఓలో పాల్గొనేలా ప్రోత్సహించనున్నారు. అనంతపురం జిల్లాలోని రెండు వేదికల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో యువత అనుసంధానమయ్యే ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ఐశయ్య, ప్రోగ్రాం సూపర్‌వైజర్ జి. శ్రీనివాసులు, మై భారత్ కో ఆర్డినేటర్ బిసాతి భరత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.ఆర్. సదాశివా రెడ్డి, నోడల్ అధికారులు శారదాదేవి, usha Rani,Narasimulu,vijaykumar,vimala నాగభూషణం మోడరేటర్లు బిసాటి జీవన్ కుమార్, జయమారుతి తెలిపారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మరియు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని యువత ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని, ప్రధానమంత్రి సందేశాన్ని వీక్షించడంతో పాటు, స్థానిక క్రీడాకారులు మరియు ప్రముఖులతో జరిగే యువ సంవాద్‌లో చురుకుగా పాల్గొని తమ ఆలోచనలు, సూచనలు పంచుకోవాలని అధికారులు కోరారు. జిల్లాలోని యువత పెద్ద ఎత్తున పాల్గొని "ఖేలో ఇండియా సంవాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యువజన అధికారులు పిలుపునిచ్చారు.



# విభూత్యలంకారంలో దర్శనమిచ్చిన నందీశ్వరుడు

## - శ్రావణ సోమవారం సందర్భంగా నందిపల్లె నందీశ్వరాలయంలో విశేష పూజలు


శ్రీ నందీశ్వరాలయం నందిపల్లి

వేంపల్లె ఆగస్టు 24 (కదిలించే వార్త):

పవిత్ర శ్రావణ మాసం సోమవారం సందర్భంగా నందిపల్లెలోని శ్రీ నందీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విభూత్యలంకారంలో భక్తులకు దర్శనమిచ్చేలా ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. శివలింగానికి విభూతి రేఖలు, సుగంధ పుష్పాలు, మల్లెలు, కనకాంబరాల దండలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రావణ సోమవారం కావడంతో ఉదయం నుంచే పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి నందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. విభూత్యలంకారంలో కొలువుదీరిన నందీశ్వరస్వామిని దర్శించుకోవడంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. శ్రావణ మాసంలో ప్రతి సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# వినతి ప్రియదర్శినికి ఎస్కేయూ పీహెచ్‌డీ ప్రదానం



అనంతపురం, ఎస్కేయూ, కదిలించే వార్త, ఆగస్టు 24 :

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధన చేసిన లివినతి ప్రియదర్శిని ఎల్.ఎం.లికు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. »»Ecotoxicology and Bioremediation Potential Assessment of Heavy Metals in the Industrially Polluted Soilsμμ అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ ఎస్. అనిత పర్యవేక్షించారు. 2026 జూలై 25న నిర్వహించిన వైవా-వోస్ అనంతరం పరిశీలకులు, వైవా-వోస్ కమిటీ ఏకగ్రీవ సిఫారసు మేరకు, అదే తేదీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందేందుకు ఆమె అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా వినతి ప్రియదర్శినిని, పరిశోధన పర్యవేక్షకురాలు ప్రొఫెసర్ ఎస్. అనితను విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు.

# ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సి. సుబ్బారామిరెడ్డి కన్నుమూత

## విద్యా రంగానికి తీరని లోటు: అధ్యాపకులు, విద్యావేత్తల సంతాపం

అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 24 :

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ విద్యావేత్త సి. సుబ్బారామిరెడ్డి (70) ఆగస్టు 23న ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన మృతి పట్ల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, విద్యావేత్తలు, వివిధ సంఘాల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి ఇంటర్మీడియట్ విద్యా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు తాలూకా దేవగుడి గ్రామంలో జన్మించిన సుబ్బారామిరెడ్డి 1975లో రైల్వే కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం కడప జిల్లా జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకుడిగా బాధ్యతలు చేపట్టి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 1988లో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై ఉద్యోగుల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అనంతపురం న్యూ టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఫిజిక్స్ లెక్చరర్‌గా బదిలీపై వచ్చిన ఆయన, అనంతరం జిల్లా సంఘం అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. ప్రమోషన్‌పై అనంతపురం పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు న్యూ టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు కళాశాలల అభివృద్ధికి విశేష కృషి చేశారు. రాష్ట్ర జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘానికి రాష్ట్ర నాయకత్వం వహించిన సమయంలో కళాశాలల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేశారు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అవసరమైన భవనాలు, ఫర్నిచర్ తదితర సదుపాయాలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. 2007లో పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. సుబ్బారామిరెడ్డి కేవలం అధ్యాపక నాయకుడిగానే కాకుండా ఎందరో లెక్చరర్లను నాయకులుగా తీర్చిదిద్దిన మార్గదర్శిగా గుర్తింపు పొందారని పలువురు స్మరించుకున్నారు. లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం, సలహాలు అందించేవారని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం విద్యా రంగానికి, ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యా రంగానికి తీరని లోటని అధ్యాపక, ప్రిన్సిపాళ్ల సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయి జర్నల్ లో అధ్యాపకుని పరిశోధన పత్రం ప్రచురణ

## అభినందించిన శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కే.సీ.హరికుమార్

అనంతపురం, ఎస్కేయూ, కదిలించే వార్త, ఆగస్టు 24 : ప్రపంచంలోనే అత్యధిక ప్రామాణికం కలిగిన ప్రముఖ అంతర్జాతీయ అకడమిక్ జర్నల్ అయినా" ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ హాస్పటాలిటీ మేనేజ్ మెంట్ జర్నల్ "లో, తమ కళాశాల మేనేజ్ మెంట్ విభాగం అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్ పరిశోధన పత్రం ప్రచురితం కావడం తమ కళాశాలకు గర్వకారణం అని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీ కేసీహరి కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు అన్నారు. "ప్రస్తుత ప్రపంచంలో మారుతున్న ఆహార పద్ధతులు-మాధ్యమాల ద్వారా దాని ప్రభావము" అనే అంశం మీద తమ కళాశాలకు చెందిన అధ్యాపకుని పరిశోధన పత్రం అంతర్జాతీయ జర్నల్ లో ప్రచురితమైన సందర్భంగా కళాశాలలో అతనిని అభినందించి మాట్లాడారు. పేరెన్నిక గల అమెరికా విశ్వవిద్యాలయాల విషయ నిపుణుల ప్రొఫెసర్లు సమీక్ష చేసి ప్రమాణాలకు తగినట్లుగా ఉంటేనే ఎంపిక చేస్తారని, కేవలం రెండు శాతం మాత్రమే ప్రచురణకు ఆమోదం పొందుతాయి అన్నారు. ఏ స్టార్ రేటింగ్ తో క్యూ వన్ జర్నల్లో ప్రచురితం కావడం గొప్ప విషయమని వారు తెలిపారు. అధ్యాపక వృత్తి లో ఉండి, కళాశాలను అంతర్జాతీయ స్థాయిలో భాగం కల్పించినందుకు వారు అభినందనలు తెలియజేశారు. అత్యంత ప్రతిష్టాత్మక పోటీతత్వం గల అకడమిక్ జనరల్ లో ప్రచురితము కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంటుందని వారు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రచురితమైన కాపీని కళాశాల కరస్పాండెంట్ కు, ప్రిన్సిపాల్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సురేష్ బాబు అధ్యాపకులు బసెట్టి క్రిష్టయ్య, ఖాజావలి పాల్గొన్నారు.



# కమల్ అమృత్ వాణి-237



స్వాస్థ్యం జీవనమూలం హి నియమః తస్య రక్షణమ్ ।
మితాహారవిహారాభ్యాం దీర్ఘమాయుః ప్రజాయతే॥

తాత్పర్యం.

ఆరోగ్యం మనిషి జీవితానికి అత్యంత విలువైన సంపద. దాన్ని కాపాడుకోవడానికి క్రమబద్ధమైన జీవనశైలి అవసరం.మితమైన ఆహారం, తగిన విశ్రాంతి శరీరానికి మేలు చేస్తాయి.నిత్య జీవితంలో శారీరక చలనం కూడా అవసరం.అతి ఆహారం, అస్తవ్యస్తమైన జీవనం శరీరాన్ని బలహీనపరుస్తాయి.ఆరోగ్యకరమైన శరీరం మనసుకు కూడా ఉల్లాసాన్ని ఇస్తుంది.ఆరోగ్యాన్ని కోల్పోయిన తర్వాత సంపదతో దాన్ని పూర్తిగా తిరిగి పొందడం కష్టం.అందుకే ఆరోగ్య పరిరక్షణ ప్రతి మనిషి మొదటి బాధ్యత.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

# ప్రమోషన్ పొందిన 14 మంది బోధనేతర ఉద్యోగులు

## యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య అనిత ని, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ చింతల ని కలిసి శాలువాలతో సన్మానించారు





అనంతపురం, ఎస్కేయూ, కదిలించే వార్త, ఆగస్టు 24 :శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రమోషన్ పొందిన 14 మంది బోధనేతర ఉద్యోగులు ఈ రోజు యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య అనిత మేడం ని, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ చింతల ని కలిసి శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఏం.పెద్దన్న, ప్రధాన కార్యదర్శి ఎం. నరేష్ ప్రమోషన్ పొందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏం.ఏ.లక్ష్మణ రావు, ఫణికృష్ణ, సూపరింటెండెంట్ వెంకట రాముడు, జూనియర్ అసిస్టెంట్ శ్రీమతి. జయంతి, శ్రీమతి గంగమ్మ, హుస్సేన్ పీర్, పెద్దన్న, ఎస్.పెద్దన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అనంతపురం జిల్లా పర్యటన వివరాలు



రాయదుర్గం నియోజకవర్గం, కదిలించే వార్త, ఆగస్టు 24 :

రాయదుర్గం నియోజకవర్గంఉదయం 08.30 బళ్లారి సమీపంలోని జిందాల్ విజయ్ నగర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకుంటారు. 09.55 - 10.10 బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును సందర్శిస్తారు.మధ్యాహ్నం12.30 - 02.00 రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ జా144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను ప్రారంభిస్తారు.02.30 - 05.30 రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం నల్లంపల్లి వద్ద ఏర్పాటుచేసిన వేదికలో రాయదుర్గం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు.

# రెండేళ్ల కూటమి పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు..ఎమ్మెల్యే అమిలినేని

## తోపుడు బండ్లు అందించి పండ్లు, పూల వ్యాపారులకు అండగా ఉంటాం

## ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందించిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు





కళ్యాణదుర్గం నియోజకవర్గం, కదిలించే వార్త, ఆగస్టు 24 :

రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమంగా చేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెడుతూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని, ఏ ఇంటికి వెళ్లి అడిగిన రెండేళ్ల పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు కంబదూరు మండల కేంద్రంలో రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలుసుకుంటూ ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ తెలుసుకునేందుకు చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి కంబదూరు మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కి, టీడీపీ నాయకులకు మండల టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలకగా అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని, ప్రధాన రహదారిలో ఉన్న అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలను కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక వైపు అభివృద్ధి చేస్తూ, ఎక్కడా కూడా సంక్షేమ పథకాలను ఆపకుండా అందిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ఒక మోడల్ గా నిలిపారని పేర్కొన్నారు..గ్రామంలో రోడ్డు పక్కన పండ్లు, పూల వ్యాపారాలు చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా తోపుడు బండ్లు అందించి ఆదుకుంటామని తెలిపారు.



# కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్సీ



అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 24 :

ఇటీవల నూతన శాసనమండలి సభ్యురాలు (ఎమ్మెల్సీ) గా ఎన్నికైన శ్రీమతి దలవాయి రమాదేవి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో గౌరవ జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి పలుఅంశాలపై చర్చించారు. జిల్లా ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సమన్వయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ శ్రీమతి దళవాయి రమాదేవి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుటుంబసభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బీసీ, మహిళా పక్షపాతి.. ఎమ్మెల్యే పరిటాల సునీత

## ఎమ్మెల్యే సునీతను కలిసిన నూతన ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి

## ఎమ్మెల్సీకి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సునీత



రాప్తాడు నియోజకవర్గం, కదిలించే వార్త, ఆగస్టు 24 :

తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీ, మహిళా పక్షపాతి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన దలవాయి రమాదేవి తన భర్త కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పరిటాల సునీతను, ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ను కలిశారు. అనంతపురం నివాసంలో ఈ మర్యాదపూర్వక భేటి జరిగింది. ఈ సందర్భంగా సునీత, శ్రీరామ్ ఎమ్మెల్సీ రమాదేవికి శుభాకాంక్షలు తెలిపి.. ఘనంగా సత్కరించారు. ఈసంద్భంగా ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మహిళలను రాజకీయంగా ప్రోత్సహిస్తోందన్నారు. వారికి అన్నింటా సమ ప్రధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు మహిళల ప్రాతినిథ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారన్నారు. అలాగే బీసీలకు అత్యధిక అవకాశాలు కల్పించింది కూడా చంద్రబాబేనన్నారు. ఈ రోజు సామాన్య క్లస్టర్ ఇన్ ఛార్జిగా ఉన్న మహిళకు, అట్టడుగు వర్గానికి చెందిన వడ్డెర కులానికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

# కూటమి ప్రభుత్వంలో వరుస విద్యార్థుల మరణాలు : YSRSU

- సెట్టూరులో మృతి చెందిన విద్యార్థికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ప్రభుత్వమే కల్పించాలి

- వార్డెన్ నిర్లక్ష్యం,డి.డి పర్యవేక్షణ లోపం, కూటమి ప్రభుత్వ వైఫల్యమే విద్యార్థి ప్రాణాన్ని బలిగొంది

- ప్రభుత్వ విద్యార్థుల భద్రతను ఆరోగ్య విషయాలను గాలికి వదిలేస్తున్న కూటమి ప్రభుత్వం

- విద్యార్థి సంఘాలు హాస్టల్లోకి రానివ్వకుండా ఇచ్చిన జీవోని ఉపసంహరించుకోవాలి

- చికిత్స పొందుతున్నటువంటి విద్యార్థి ఖర్చులు ప్రభుత్వమే భరించుకోవాలి

- జేసీ విష్ణు చరణ్ కి వినతిపత్రం సమర్పించిన వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు

- జిల్లా వ్యాప్తంగా నెలకొన్న హాస్టల్లో సమస్యల మీద రివ్యూ మరియు ఆడిట్ నిర్వహించి కావాల్సిన నిధులు విడుదల చేసి అభివృద్ధి పరచాలి

అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 24 :

కళ్యాణదుర్గం,సెట్టూరు మండలంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో పాడుబడిన గోడ కూలి దళిత విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఈ ఘటన వార్డెన్ నిర్లక్ష్యానికి, డిడి పర్యవేక్షణ లోపానికి, కూటమి ప్రభుత్వ వైఫల్యమని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విద్యార్థి నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ గారికి విద్యార్థుల సమస్యల గురించి వారికి కావాల్సిన న్యాయం గురించి అక్కడ ఉన్నటువంటి పరిస్థితుల గురించి వినతి పత్రం సమర్పించడం జరిగింది ఆయన మాట్లాడుతూప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల భద్రత పూర్తిగా గాలికి వదిలేశారని, ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఒక పేద దళిత విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరో విద్యార్థి అక్షయ్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందడం బాధాకరమన్నారు.వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారి డి.డి పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వార్డెన్, సంబంధిత విద్యాశాఖ అధికారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యతను విస్మరించి కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించే పనిలో నిమగ్నమయ్యారని చంద్రశేఖర్ యాదవ్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు అందించేందుకు అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ విద్యను నాశనం చేసే విధానాలు అమలు చేస్తోందని ఆరోపించారు. విద్యార్థి నాయకులు సమస్యలు ప్రభుత్వానికి కనపడేలా చూపిస్తున్నారన్న కక్షతో ముఖ్యమంత్రివర్యులు మరియు మంత్రి నారా లోకేష్ విద్యార్థి నాయకులను హాస్టల్స్ లోకి స్కూల్స్ లోకి అనుమతించకూడదని జీవోను తెచ్చిన ఘనత వారికి దక్కుతుందని వెంటనే ఆ జీవోని ఉపసంహరించుకోవాలని,మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి కనీసం రూ.కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్య చికిత్స అందించి పూర్తి ఖర్చును ప్రభుత్వం భరించాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, శెట్టురు మండల అధ్యక్షులునవీన్ నాయకులు హరీష్,చరణ్,రెడ్డి సాహిద్, రఫీ, శేఖర్, గౌస్,రాఘవ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు

